ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ గౌతమ్ విద్యార్థినులను సూచించారు. సోమవారం ఆయన కిష్టాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. 10వ తరగతిలో బాగా చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో విద్యార్థులతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించాలని ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రిన్సిపాల్ లలిత.. కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ అధికారి రజిత, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, పక్కన మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్

ఘనంగా మలిపెద్ది జన్మదిన వేడుకలు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం ప్రతాప్‌సింగారంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్, సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు.



వికారాబాద్‌లోని డంపింగ్ యార్డు

చెత్తశుద్ధి ఏది?

బల్దియాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను చెత్త సమస్య వేధిస్తోంది. మున్సిపాలిటీల్లో లక్షల టన్నుల్లో చెత్తపేరుకుపోయింది. చెత్తను క్లీన్ చేసేందుకు చేపట్టిన బయోమైనింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. బయో మైనింగ్ విధానంలో చెత్త భూమిలో పాతి పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో డంపింగ్ యార్డులు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెత్తను కాల్చడం ద్వారా సమీపంలోని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- డంపింగ్ యార్డుల ప్రక్షాళన శూన్యం
- బయోమైనింగ్ లేక పేరుకుపోతున్న వ్యర్థాలు
- నిప్పుపెట్టడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు
- బయోమైనింగ్‌కు ఎంపికైన వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీలు
- అయినా అమలుకు నోచని వైనం
- తుక్కుగూడలోనూ ప్రారంభం కాని పనులు
- పరిగిలో డంపింగ్ యార్డు సమస్య

జిల్లా	మున్సిపాలిటీలు	కార్పొరేషన్లు
రంగారెడ్డి	15	03
వికారాబాద్	04	00
మేడ్చల్	09	05
మొత్తం	28	08



చేవెళ్ల సంతలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్సిపాలిటీలు బయోమైనింగ్‌కు దూరంగా ఉంటున్నాయి. డంపింగ్ యార్డులు ప్రక్షాళన జరగడం లేదు. జనాభా పెరుగుదలతో పాటు కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. ఇదే తరహాలో చెత్త కూడా పేరుకుపోతుంది. ఏళ్ల తరబడి చెత్త సమస్య అపరిష్కృతంగానే ఉంటుంది. బయోమైనింగ్ విధానంలో చెత్త భూమిలో పాతి పెట్టేందుకు ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. చెత్తశుద్ధి జరగడం లేదు. డంపింగ్ యార్డులో వ్యర్థాలు టన్నుల కొద్దీ పేరుకు పోతున్నాయి. చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సమస్య పరిష్కరించాలి

కోట్‌పల్లి, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోత్కుపల్లి, బార్వాద్, కరీంపూర్, జిన్నారం, బీరెల్లి, కంకణాలపల్లి, వికారాబాద్, ధారూర్, మండలంలోని మైలార్ దేవరాంపల్లి పీలారం, ధర్మాపురం, నర్సాపూర్, తదితర గ్రామాలలో బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సమస్యలను పరిష్కరించాలని సోమవారం హైదరాబాద్ టెలికాం డీజీఎం(ప్లానింగ్) అశోక్, డీజీఎం(సెంట్రల్) రామానందంకు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కాగా, నెట్వర్క్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల జిన్నారం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న బసవ పున్నయ్య

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య తెలిపారు. సోమవారం అనంతగిరి ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. రైల్వే పాసులను పునరుద్ధరించాలని రైల్వే నిలయం ఎదుట ధర్నా చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండీ షఫీ, సంజీవ్, వెంకట్ రాంరెడ్డి, బాలరాజు, మాణిక్యం, అరుణ్, కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త టీచర్లు

2008 డీఎస్సీ అభ్యర్థుల్లో వంద మందికి ఉద్యోగాలు

96 మందికి నియామక పత్రాలు జారీ, పాఠశాలల కేటాయింపు.. సోమవారం విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాకు కొత్త టీచర్లు వచ్చారు. డీఎస్సీ -2008లో మెరిట్ జాబితాలో ఎంపికైన ఉపాధ్యాయ ఉద్యోగాలకు నోచుకోని అభ్యర్థులకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 219 మందిని ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 100 మందిని ఎంపిక చేయగా, రంగారెడ్డి జిల్లాలో 99 మంది, మేడ్చల్ జిల్లాలో 20 మందిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించారు. ఎంపికైన అభ్యర్థులకు శనివారం నియామక పత్రాలు అందజేయగా వారు సోమవారం విధుల్లో చేరారు. 2008 డీఎస్సీలో ఎస్జీటీ పోస్టుల్లో డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం కేటాయించిన నేపథ్యంలో మెరిట్ జాబితాలో చోటు దక్కినా ఉద్యోగాలకు నోచుకోలేకపోయిన విషయం తెలిసిందే. మెరిట్ జాబితాలో ఎంపికైన తమను ఉపాధ్యాయులుగా నియమించాలని కోరుతూ వారు సుదీర్ఘ కాలం పోరాటం చేశారు. ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు వారిని కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 2008 డీఎస్సీ నియామకాలకు సంబంధించిన అంశం సోమవారం హైకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో ఎంపికైన

మిగతా 8వ పేజీలో...



బషీరాబాద్ ఎమ్మార్సీ భవనం వద్ద నూతన ఉపాధ్యాయులు

ఆశ.. అడియాసేనా?

డీఎస్సీ-2024లో ఉద్యోగావకాశాలు తృటిలో తప్పిపోయిన అభ్యర్థులు వచ్చే డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించేందుకు రాత్రింబవళ్లు సన్నద్ధమవుతున్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థుల నియామకంతో జిల్లాలో ఎస్జీటీ పోస్టుల్లో వంద పోస్టులు తగ్గిపోయాయి. జిల్లాలో తెలుగు మీడియం ఎస్జీటీ పోస్టులు 213 ఖాళీగా ఉండగా, వాటిలో 97 పోస్టులను కొత్త ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేశారు. వచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఈ ఏడాది డిసెంబరు వరకు ఉద్యోగ విరమణ ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

» హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్

పరిగి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పరిగిలో జరిగిన దివ్యాంగుల హక్కుల పరిరక్షణపై జరిగిన సమావేశంలో ఆయన మాటాడారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల తరహాల్లో తెలంగాణలోనూ అమలు చేయాలని కోరారు. ఈ రిజర్వేషన్ల కల్పనకోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల వివక్షతను చూపుతోందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి.సుధీర్, పరిగి తాలుకా ఇన్‌చార్జి లక్ష్మయ్య, పరిగి, దోమ మండలాల అధ్యక్షులు పి.చంద్రయ్య, చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

సేవాలాల్ బోధనలు అనుసరణీయం

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలను పాటిస్తూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం ఆయన జయంతిని పురస్కరించుకొని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సంచార జాతులుగా ఉండే బంజారాలను చైతన్య పరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. సంత్ సేవాలాల్ జంతు బలి నిషేధాన్ని ప్రచారం చేసిన గొప్ప అహింసా వాదని గుర్తు చేశారు. అనంతపూర్ జిల్లా గుత్తి మండలంలో జన్మించిన సేవాలాల్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో పర్యటించి బంజారాల ఎదుగుదలకు ఎంతగానో కృషి చేసి వారి ఆరాధ్య దైవ్యంగా కీర్తించబడుతున్నారన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకునే దిశగా అడుగులు వేసిన మహోన్నత వ్యక్తి సంత్ సేవాలాల్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎండబ్ల్యూవో కమలాకర్ రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

దుద్యాల: మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు వెడల్పు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, వసతి గృహాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. 21న సిడె కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానుండటంతో హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎల్‌పీవో శంకర్‌నాయక్, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ కిషన్‌నాయక్, ఎస్సై యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆలయ చైర్మన్ జయరాములు, మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

550 కిలోల నకిలీ విత్తనాల పట్టివేత

● ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దేముల్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు భారీగా నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, తాండూరు రూరల్ సీఐ నాగేశ్, పెద్దేముల్ పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పెద్దేముల్ అంబేద్కర్ విగ్రహం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద లేబుల్స్, లాట్ నెంబర్, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ లేని పత్తి విత్తనాల సంచులు లభించాయి. కాగా, అవి నకిలీ విత్తనాలని నిర్ధారణ అయిందని పట్టుబడిన వ్యక్తి ఉప్పల పాటి వసంత్‌రావుగా గుర్తించారు. ఆయనది ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా. 15 ఏళ్లుగా కర్ణాటకలో నివాసం ఉంటున్నాడన్నారు. గుర్మిట్కల్ నుంచి ఈ విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అధిక ధరలకు అమ్మాలని ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడించారన్నారు. అతని వద్ద 150 కేజీల నకిలీ పత్తి విత్తనాలు రూ.2.70 లక్షల విలువైనవిగా గుర్తించారు. అలాగే అతడి నివాసంలో మరో 400 కేజీల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తంగా 550 కేజీల నకిలీ విత్తనాలు (రూ.9.90 లక్షలు) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై 2023లో బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నకిలీ విత్తనాల కేసు నమోదైందన్నారు. ఈమేరకు కేసు నమదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మేనబావను కడతేర్చిన 16 ఏళ్ల బాలుడు



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 16 ఏళ్ల బాలుడు తన మేనబావను కత్తితో గొంతుపై దాడిచేసి హతమార్చాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలో ఆలస్యంగా వెలుగు చూసింది. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డు పక్కన ఓ అద్దె ఇంట్లో వెంకటరమణ(30) తల్లి రాధ, అన్న శ్రీనివాస్(మానసిక దివ్యాంగుడు)తాత జంగయ్యతో పాటు మేనమామ కుమారుడు(16)తో కలిసి నివసిస్తున్నాడు. వెంకటరమణ తన అర్చక వృత్తిని మానుకుని ఇటీవల తాగుడుకు బానిసయ్యాడు. తరచూ తాగొచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో విసిగెత్తిన బాలుడు ఆదివారం రాత్రి తన బావ వెంకటరమణతో కలిసి అతని గదిలో పడుకున్నాడు. ఇదే క్రమంలో బాలుడు గదిలో ఉన్న కత్తితో వెంకటరమణ మెడపై వేటు వేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబ సభ్యులను వేధించే వెంకటరమణ ఇంట్లో ఉన్నప్పటికీ ఎలాంటి చప్పుడు రాకపోవడంతో అనుమానం కలిగి కుటుంబ సభ్యులు సాయంత్రం అతని గదిలో వెళ్లి చూడగా రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాల గురించి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 98 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో 77 ఫిర్యాదులు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. కాగా, ప్రజావాణిలో 77 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్వో హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల అభివృద్దే కాంగ్రెస్ లక్ష్యం



పూడూరు రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పేదలు అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ లక్ష్యం అని, పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పూడూరులోని రైతు వేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో75శాతం సబ్సిడీపై రూ.47 లక్షల విలువగల 158 స్ప్రింక్లర్ల యూనిట్లను రైతులకు అందజేశారు. అనంతరం మన్నెగూడ, అంగడి చిట్టెంపల్లి, పెద్ద ఉమ్మెంతాల్‌లో రూ.3.2కోట్లతో నిర్మించిన గోదాంలను ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇస్తున్న రైతు భరోసా సాయం మొత్తం ఎక్కువన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పేదలందరికీ ఇళ్లను కట్టిస్తామన్నారు. నియోజకవర్గంలో రెండు విడతల్లో 7వేల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. రైతులకు 75శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను ఇచ్చింది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. 41గుంటలకు మించి భూమి బోరు/బావి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పట్టా పాస్బుక్కు, ఆధార్, బ్యాంకు పాస్బుక్కు, ఫొటోలతో మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 పైపులు, 5 స్ప్రింక్లర్ సెట్లకు రైతులు రూ.7,500ల డీడీ తీసి దరఖాస్తుకు జత పరిచి ఉద్యానవన శాఖ అధికారులకు అందజేయాలని తెలిపారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ సర్కారు సబ్సిడీ స్కీంలు ఇవ్వకుండా రైతులకు నష్టం చేసిందన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య, ప్యాక్స్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా ఉద్యాన/పట్టుపరిశ్రమ అధికారి ఎంఏ.సత్తార్, ఉద్యాన అధికారి వైజయంతి, తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో పాండు, ఏవో తులసీరాం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురేందర్, నాయకులు కడ్మూరు ఆనందం, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, నారాయణ, రాములు, వీరేశ్, అజీంపటేల్, షకీల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏవోతో కలిసి వ్యవసాయ శాఖ డెయిరీ, క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

క్రాంతికిరణ్‌కు కృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం



వెంకటక్రాంతికిరణ్

కడ్తాల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రావిచెడ్ గ్రామానికి చెందిన పుట్టపాక వెంకటక్రాంతి కిరణ్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం దక్కింది. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా యేటా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సామాజిక కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రైడ్ ఇండియా, సిటిజన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది వైద్య, రక్తదాన శిబిరాలు, చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రాంతికిరణ్‌ను ఎంపిక చేశారు. సోమవారం తిరుపతిలో సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బాల్‌రాజ్, ప్రైడ్ ఇండియా కల్చరల్ సీఈవో వెంకటేశ్వర్‌రావు, టీడీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిలు క్రాంతికిరణ్‌కు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కేంద్ర స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



యోగీశ్వర్ స్పందన శరణ్య

కేశంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనానికి(ఎన్ఎంఎంఎస్) కొత్తపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో తొమ్మిదో తరగతి నుంచి ఏటా రూ.12,000 స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నవంబరులో ఎంపిక పరీక్ష నిర్వహిస్తుంది. ఎంపికైన విద్యార్థులు డిగ్రీ పూర్తిచేసే వరకు స్కాలర్‌షిప్‌ను ఏటా బ్యాంక్ అకౌంట్‌లో వేస్తారని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఇటీవల విడుదలైన ఎంపిక జాబితాలో కొత్తపేట స్కూల్ విద్యార్థులు జువ్వ స్పందన, మారెపల్లి శరణ్య, కుంటి యోగీశ్వర్ ఉన్నారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, సబ్జెక్ట్ టీచర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ గోపిలను ఎంఈవో అభినందించారు.

ఫీజు చెల్లించలేదని విద్యార్థులను ...

అనుమతించని యాజమాన్యం

- గంటలపాటు పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టిన వైనం
- నందిగామ మండలం హిప్పో క్యాంపస్ స్కూల్లో ఘటన
- ఆవేదన వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



హిప్పో క్యాంపస్ స్కూల్ ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

నందిగామ, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించలేదని విద్యార్థులను తరగతి గదిలోకి అనుమతించకుండా పాఠశాల ఆవరణలో కూర్చోబెట్టిన సంఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం హిప్పో క్యాంపస్ స్కూల్లో సోమవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలు రాయిస్తామని చెప్పారని తల్లిదండ్రులు వాపోయారు. తోటి విద్యార్థుల ముందు ఇలా అవమానకరంగా బయట కూర్చోబెడితే విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్కూల్ యాజమాన్యం స్పందిస్తూ.. ఫీజు చెల్లించని విద్యార్థులను మీటింగు హాల్లో కూర్చోబెట్టామని, ఎండలో కూర్చోబెట్టలేదని తెలిపారు. ఫీజు కట్టకుంటే స్కూల్‌ను ఎలా రన్ చేస్తామని అన్నారు. ఫీజ్ చెల్లించాలని ఎన్నోసార్లు చెప్పినా స్పందించడం లేదని చెప్పారు.

బకాయిలు చెల్లించకుంటే సీజ్

- పన్ను వసూళ్లపై బల్దియా అధికారుల దూకుడు
- రంగంలోకి మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ విభాగ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇంటి యజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పేరుకుపోతున్న ఆస్తి పన్ను, కమర్షియల్ ట్యాక్సుల మొండిబకాయిలు.. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో మున్సిపల్ యంత్రాగం కదుల్తోంది. సోమవారం మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి ఆధ్వర్యంలో బల్దియా రెవెన్యూ శానిటేషన్ విభాగాల సిబ్బంది బకాయిదారుల వద్దకు పన్ను చెల్లించాలని కోరారు. పెద్దేముల్ రోడ్డులో ఐదేళ్లుగా ట్యాక్స్ కట్టకుండా నిర్వహిస్తున్న సన్బార్ లాడ్జి, రెస్టారెంట్ బిల్డింగ్‌పై దాడులు నిర్వహించి బకాయిలు చెల్లించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. దీంతో యజమాని మంగళవారం సాయంత్రం వరకు కమిషనర్‌ను గడువు కోరారు. నేటి సాయంత్రంలోగా రూ.11లక్షల ఆస్తిపన్ను కట్టకుంటే బిల్డింగ్‌కు తాళం వేస్తామని, ఇక గడువు ఇవ్వం అని కమిషనర్ తేల్చి చెప్పారు. పక్కనే ఉన్న మెట్రో ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి బకాయిలు చెల్లించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్‌కు సంబంధించి రూ.12.97లక్షల బకాయుండగా యజమాని రూ.6.5లక్షల చెక్కు, రూ.1.91లక్షల నగదును చెల్లించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పన్ను వసూళ్లలో దూకుడు పెంచాలని అధికారులు నిర్ణయించారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14న 'పన్ను వసూళ్లలో తాండూరు లాస్ట్'.. అలాగే ఈ నెల 15న 'పన్ను వసూళ్ల లక్ష్యం చేరకుంటే వేటు' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో మున్సిపల్ అధికారులు ఆస్తిపన్ను వసూళ్లకు డ్రైవ్ చేపడుతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో ఇప్పటి వరకు రూ.10కోట్ల పన్ను బకాయిలు రావాలని అధికారులు పేర్కొన్నారు.



బకాయిలున్న సన్బార్ కమర్షియల్ బిల్డింగ్

జీతాలివ్వడం లేదని ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు...

ఆత్మహత్యాయత్నం

» పరిస్థితి విషమం » హైదరాబాద్‌కు తరలింపు


చికిత్స పొందుతున్న నర్సిములు

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, బిడ్డ పెళ్లి ఉన్నదంటే కూడా ఏజెన్సీ నిర్వాహకులు జీతం ఇవ్వడం లేదనే మనో వ్యథతో ఆస్పత్రి సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం తాండూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత తాండూరుకు చెందిన నర్సిములు తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో 30ఏళ్లుగా వివిధ ఏజెన్సీల ద్వారా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉండగా.. ఇటీవల రెండు నెలల జీతం చెల్లించారని, మరో రెండు నెలల బకాయిన్నాయని తెలిపాడు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం నర్సిములు పురుగుల మందు తాగాడు. తన కూతురు పెళ్లిపెట్టుకున్నామని, జీతాలు చెల్లించాలని కోరినా ఏజెన్సీ పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని నర్సిములు కోరాడు. మొదట అతడికి తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫెర్ చేశారు.


నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

ఆస్పత్రి సిబ్బందిపై వేధింపులు ఆపాలి

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సిబ్బందిపై వేధింపులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రి వద్ద కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గత 18నెలల నుంచి కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని వినాయక ఏజెన్సీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. జీతాలివ్వడం లేదని, పీఎఫ్ జమ కాలేదని సెక్యూరిటీ గార్డ్ నర్సిములు ఆత్మహత్యాయత్నం చేశాడని అన్నారు. నిరసన కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవో డానియల్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సొంత డబ్బులుపెట్టి అప్పులపాలయ్యాం

కోట్‌పల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణకు నిధులను విడుదల చేయాలని సోమవారం కోట్‌పల్లి మండల పరిషత్‌లో ఎంపీడీవో డానియల్‌కు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. 2024 ఫిబ్రవరి నుంచి సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి డబ్బులు రాలేదన్నారు. పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, ఇతర పనులకు సొంత డబ్బులు చెల్లించామన్నారు. బిల్లులను చెక్కుల రూపంలో చెల్లించామని, చెక్కులు ఐఎఫ్ఎంఎస్‌లో ఆగస్టు నుంచి పేమెంట్ కాలేదన్నారు. పంచాయతీల కోసం సొంత డబ్బు వెచ్చించామన్నారు. షాపులకు, వెండర్లకు ఇచ్చిన చెక్కులు గత ఆగస్టు నుంచి క్లియర్ కాలేదని తెలిపారు. వేసవిలో నీటి నిర్వహణకు భారీగా నిధులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సిములు, రాఘవేందర్, ప్రవళిక, హేమలత, లావారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నక్ష సర్వే కోసం మార్కింగ్ చేసిన అధికారులు

నేటి నుంచి నక్ష సర్వే

కొడంగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష పైలెట్ సర్వే కొడంగల్ మున్సిపాలిటీలో మంగళవారం నుంచి చేస్తామని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలో నక్ష సర్వే నిర్వహణకు సర్వే ఆఫ్ ఇండియా విభాగాల ఆధ్వర్యంలో 20 పాయింట్లను మార్కింగ్ చేశారు. మున్సిపల్ పరిధిలో ఇళ్లు, ఖాళీ స్థలాలు, పట్టా భూములు, ప్రభుత్వ స్థలాల సర్వే చేసి హద్దులు, విస్తీర్ణాన్ని డిజిటలైజ్ చేస్తామని తెలిపారు. సర్వే కోసం ఇప్పటికే కొడంగల్‌కు హెలికాప్టర్ వచ్చినట్లు తెలిపారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పార్టీ-2025 క్యాలెండర్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా సభ్యులు విఠల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, నాయకులు నర్సిములు, రాజప్పగౌడ్, సలీం, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదప్ప, రాంలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

» మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ కోటిరెడ్డి, వెనుకవైపు నిందితులు

మేడ్చల్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో తీవ్ర కలకలం సృష్టించిన యువకుడి దారుణ హత్యకు సంబంధించిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఉమేశ్ అనే వ్యక్తిని హతమార్చిన వారిలో అతడి సొంత తమ్ముడు, మరో నలుగురు బంధువులున్నట్లు తెలిపారు. ఉమేశ్ చెడు వ్యవసాలను బానిసై కుటుంబీకులను శారీరకంగా వేధించడంతో తట్టుకోలేక ఉమేశ్ సొంత తమ్ముడు రాకేశ్, అతడి బాబాయి కొడుకు లక్ష్మణ్, మరో ముగ్గురు యువకులు (సమీప బంధువులు) బి.నవీన్, సురేష్, నరేశ్‌లతో కలిసి హతమార్చారని వెల్లడించారు. ఉమేశ్‌పై కామారెడ్డి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో చైన్ స్నాచింగ్, గొడవలకు సంబంధించిన 14 కేసులున్నట్లు తెలిపారు. ఉమేశ్ కారణంగా కుటుంబం మనోవేదనకు గురవుతున్నారని, దీంతో అతడి చంపాలని సోదరుడు రాకేశ్, లక్ష్మణ్‌తో పథకం వేసి మరో ముగ్గురిని పిలుచుకున్నారన్నారు. ఆదివారం సాయంత్రం కూడా ఉమేశ్ ఇంట్లో గొడవపడి కుటుంబ సభ్యులను తిట్టడం చేశాడు. ఆగ్రహించిన రాకేశ్, లక్ష్మణ్‌లు ఉమేశ్‌పై కత్తితో దాడి చేశారు. వారి నుంచి ఉమేశ్ తప్పించుకొని ఆర్టీసీ డిపో వద్ద హైవేపైకి చేరుకున్నాడు. నిందితులు ఉమేశ్‌ను వెంటాడుతూ రోడ్డుపైకి వచ్చి అందరూ చూస్తుండగానే కత్తులతో ఉమేశ్ గొంతుకోసి పొడిచి చంపి అక్కడి నుంచి పరారయ్యారని డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు.

గంటల వ్యవధిలోనే అదుపులోకి ...

స్థానికులను దిగ్ర్భాంతికి గురి చేసిన ఈ ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, రెండు కత్తులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు సూత్రధారి హతుడి సొంత తమ్ముడు రాకేశ్ కావడం గమనార్హం. నేరచరిత్ర గల తన అన్న కారణంగా కుటుంబీకులమంతా సమాజంలో తలెత్తుకోలేకపోతున్నామనే కోపంతోనే ఈ హత్య చేసినట్టు నిందితులు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు.

చెత్త ‘శుద్ధి’ ఏది?

(ఐదో పేజీ తరువాయి)

కార్మికులు డంప్ చేస్తున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. వ్యర్థాలను దహనం చేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి చేరువవుతోన్నారు. రోజురోజుకూ వెలువడుతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి. స్థలం సరిపడక చెత్త నిల్వలు ఉంచడం కష్టంగా మారుతోంది. నిల్వఉన్న వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా కనుమరుగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణ యోగ్యం కావడం లేదు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 28 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలున్నాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు ఉన్నాయి. చాలావరకు చెత్తను పారిశుధ్య కార్మికుల ద్వారానే సేకరిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో వికారాబాద్, తాండూరు బయోమైనింగ్ అమలుకు ఎంపికైనా కార్యరూపం దాల్చడం లేదు. బయో మైనింగ్ అమలు చేసేందుకు వికారాబాద్ మునిసిపాలిటీలో టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. అమలు బాధ్యతను పర్యవేక్షించాల్సిన సృష్టి అనే సంస్థ అధికారులు ఒకసారి మున్సిపల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఇంత వరకు మళ్లీ వారు వికారాబాద్‌కు రాలేదు. పరిగి, కొడంగల్ మునిసిపాలిటీలు బయో మైనింగ్ పరిధిలో లేవు. ఈ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ బండ్లు, ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చేపడుతున్నారు. పరిగి మునిసిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య నెలకొంది.


చేవెళ్ల మున్సిపాలిటీలో రోడ్డుపై శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో కొత్త మున్సిపాలిటీలుగా ఇటీవలే చేవెళ్ల, మొయినాబాద్ మండలాలు ఏర్పడ్డాయి. 15 మున్సిపాలిటీలతో పాటు 3 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులున్నాయి. సెగ్రిగేషన్ విధానం పూర్తిగా అమలు కావడం లేదు. ఒకే కవర్‌లో వేసి ఆటోలో వేస్తున్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం లేదు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. బయో మైనింగ్ విధానం గత 8 నెలల క్రితమే ప్రారంభమైంది. డంపింగ్ యార్డు పక్కనే దీనిని ఏర్పాటు చేసి చెత్తను శుద్ధి చేయడంతో పాటు సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీకి ఇప్పటి వరకు చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య సిబ్బంది తోనే గ్రామాల వారీగా చెత్తను సేకరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో చెత్త సేకరణకు 10 ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. చెత్త సెగ్రికేషన్ పూర్తి స్థాయిలో చేయడం లేదు. 25 శాతం మాత్రమే చేస్తున్నారు. బయో మైనింగ్ గాను డంపింగ్ యార్డులో మిషన్లు బిగించారు. కానీ.. ఇంకా ప్రారంభించ లేదరు. మహేశ్వరం మున్సిపాలిటీలో బయో మైనింగ్ పేరుతో చెత్త సెగ్రిగేషన్ చేసేందుకు పిలిచిన టెండర్లలో తుక్కుగూడ మున్సిపాలిటీని దక్కించుకున్న సంస్థ పనులను ఇంకా ప్రారంభించలేరు.

బయోమైనింగ్ అంటే?

డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ప్రత్యేక యంత్రాల ద్వారా రీ సైకిల్ చేయడమే బయోమైనింగ్. 100 మిల్లీ మైక్రాన్ల (ఎంఎం) కంటే ఎక్కువ పరిమాణం ఉన్న వ్యర్థాలు ఉంటే పెద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, రాళ్లు, దస్తుల వంటి వాటితో పాటు ప్లాస్టిక్ మెటీరియల్‌లోనూ రీ సైక్లింగ్‌లలో వివిధ దశల్లో బయటకు వస్తాయి.

రంగరాజన్‌పై దాడి కేసు..

కస్టడీకి వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిచేసిన కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డిని మూడు రోజులు పోలీసుల కస్టడీకి ఇచ్చేందుకు రాజేంద్రనగర్ కోర్టు అనుమతిచ్చింది. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వీరరాఘవరెడ్డిని పోలీసులు కస్టడీకి తీసుకొని మూడు రోజుల పాటు విచారించనున్నారు. వీరరాఘవరెడ్డిని ఎక్కడ విచారించాలనేది ఇంకా నిర్ణయించ లేదు. దాడికి సంబంధించిన సంఘటనపై పోలీసులు ప్రశ్నావళి ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. మంగళవారం నుంచి గురువారం వరకు విచారించనున్నారు. వీరరాఘవరెడ్డి ఐదు రోజులు కస్టడీకివ్వాలని పోలీసులు కోర్టు పిటిషన్‌లో కోరగా కోర్టు మూడు రోజులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రామరాజ్యం స్థాపన పేరుతో వీరరాఘవరెడ్డి చేసిన కార్యక్రమాలన్నీ పోలీసు విచారణలో వెలుగులోకి రానున్నాయి.

రావల్‌కోల్ మున్సిపాలిటీని

ఏర్పాటు చేయాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మండల రూరల్ గ్రామాలను కలుపుతూ ఎల్లంపేట మున్సిపాలిటీకి బదులుగా రావల్‌కోల్ మున్సిపాలిటీగా పేరుమార్చి ఏర్పాటు చేయాలని మాజీ వైస్ఎంపీపీ గోపని వెంకటేశ్ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు. రూరల్ గ్రామాలకు రావల్‌కోల్ మధ్యలో ఉందని, దానికి తోడు మిగతా గ్రామాలకన్నా రావల్కోల్‌లో ఎక్కువ జనాభా ఉన్నారని తెలిపారు.

ఉప్పల ఉదారం.. సొంతిల్లు సాకారం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. నిరుపేద మహిళకు ఇల్లు కట్టించి గూడు కల్పించారు. సోమవారం గృహప్రవేశం చేయించి పేదరాలి కుటుంబంలో ఆనందాన్ని నింపారు. కోనాపూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి జంగమ్మ కూలిపనులు చేసుకుంటూ గుడిసెలో ఏళ్లుగా కాలం ఎల్లదీసింది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాది క్రితం కోనాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సమయంలో వచ్చిన ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌కు జంగమ్మ ఇల్లు లేదని తన కష్టాలను వివరించింది. తనకు ఇంటి నిర్మాణానికి చేయూతనివ్వాలని వేడుకుంది. దీంతో వెంకటేశ్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటినిర్మాణం చేయిస్తానని జంగమ్మకు అరునెలల్లో రూ.10లక్షల వ్యయంతో రెండు గదులు, ఓ వంట గదితో ఆర్సీసీ ఇంటిని నిర్మాణం చేయించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాల్‌రాజ్, ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌లతో కలిసి జంగమ్మ గృహప్రవేశం చేసింది. గ్రామస్థులందరితో కలిసి సత్యనారాయణస్వామి వ్రతం చేసి ప్రసాదాన్ని అందజేసింది. వెంకటేశ్‌ను మాజీ ఎమ్మెల్యేలు, గ్రామస్థులు సత్కరించారు. ట్రస్ట్ ద్వారా సామాజిక సేవలను ఏటేటా విస్తరిస్తున్నామని, పేద పిల్లల చదువులకు ఆర్థికంగా చేయూతనిస్తున్నట్టు వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్ రావు, ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అనిల్, డాక్టర్ అఖిల్, మంజుల, నాయకులు నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డుపల్లి సంజీవ, శంకర్, శ్రీను, రమేశ్‌నాయక్, పంతునాయక్, గోపాల్, వెంకటయ్య, కె.రవి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, రాజు, జంగయ్య, యాదగిరి, చంద్రకాంత్, టిప్పుసుల్తాన్, శివ, శ్రీకాంత్, రాజు, ఈదమయ్య, కుమార్, హజీపాషా, యాదయ్య పాల్గొన్నారు.


జైపాల్‌యాదవ్, బాల్‌రాజ్, ఉప్పల వెంకటేశ్‌లతో కలిసి గృహప్రవేశం చేస్తున్న జంగమ్మ

కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని

ఆమనగల్లుకొస్తున్నారు?

కడ్తాల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు దీక్షల పేరిట కుట్ర రాజకీయాలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. అధికారం పోయాక బీఆర్ఎస్సోళ్లకు ప్రజల బాధలు గుర్తొస్తున్నాయి అని ఎద్దేవా చేశారు. కడ్తాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో రవి, రాజేశ్ మాట్లాడారు. రైతు దీక్షల పేరుతో రాజకీయ లబ్ధికి కేటీఆర్ సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొడుతూనే ఉన్నారన్నారు. పదేళ్లు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. కల్వకుర్తి వెనుకబాటుకు కారణమైన కేటీఆర్ ఏ ముఖం పెట్టుకొని ఆమనగల్లుకు వస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు లక్ష రూపాయల వరకు పంటరుణం మాఫీ చేస్తామన్న బీఆర్ఎస్ పాలకులు.. ఏళ్ల పాటు కాలయాపన చేసి నాలుగు విడతలుగా కొందరికి మాత్రమే మాఫీ చేసినా అది వడ్డీకి కూడా సరిపోలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమిస్తామని మాట తప్పారన్నారు. ధరణి పేరుతో అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రైతులకు పంట రుణమాఫీ చేసిందని, రూ.6వేల చొప్పున రైతు భరోసా ఇచ్చిందన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు తులసీరామ్, భానుకిరణ్, సాయిగౌడ్, అశోక్‌గౌడ్, షాబుద్దీన్, నరేశ్, శ్రీకాంత్, రమేశ్ నాయక్, మహేశ్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న రవి, రాజేశ్


మున్సిపల్ సిబ్బందితో గొడవపడుతున్న నాయకులు

గుండ్లపోచంపల్లిలో ఫ్లెక్సీల వివాదం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సాకేత్ గేటెడ్ కమ్యూనిటీలో, కృషి హోమ్ అనాథాశ్రమంలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన కార్యక్రమాలకు ఎంపీ సంతోష్‌రావు, ఎమ్మెల్యే మల్లారెడ్డి వస్తున్నారని స్వాగతం పలుకుతూ ఆదివారం రాత్రి ఫ్లెక్సీలు కట్టారు. సోమవారం ఉదయం గుండ్లపోచంపల్లి మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు. కేసీఆర్ జన్మదిన కార్యక్రమం ఒకవైపు నిర్వహిస్తుండగానే సాకేత్ సమీపంలో, కృషి హోమ్ అనాథాశ్రమం వద్ద ఉన్న ఫ్లెక్సీలను తొలగించేందుకు సిబ్బంది చేరుకున్నారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. పాలక కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ తమ ఫ్లెక్సీలను తొలగిస్తున్నారంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ లేపకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రీడల్లో సత్తాచాటిన

గురుకుల విద్యార్థినులు

కీసర, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో సత్తాచాటారు. మలక్‌పేట్, చార్మినార్, నాంపల్లిలకు చెందిన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను కీసరలో ఏర్పాటు చేశారు. ఈ విద్యార్థినులు ఇటీవల ఢిల్లీ, జమ్ము, కాశ్మీర్, బిహార్, ఉత్తరాఖండ్‌లలో అండర్-14, 17, 19 విభాగాల్లో రైఫిల్ షూటింగ్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. విద్యార్థినల్లో నలుగురు ఇండియన్ ట్రయల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి జరగనున్న ఇండియన్ ట్రయల్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. సోమవారం ప్రిన్సిపాల్ రాములు విద్యార్థినులను అభినందించారు.


ప్రిన్సిపాల్ రాములతో విద్యార్థినులు

కేసీఆర్‌కు

శుభాకాంక్షల వెల్లువ

వికారాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆయనను సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ సైతం శుభాకాంక్షలు తెలిపారు.



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, శుభప్రద్ పటేల్


మున్సిపల్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

ఆర్పీపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలకు రుణాలు ఇప్పించి మోసం చేసిన ఆర్పీ లోలాక్షిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం డ్వాక్రా మహిళలు మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. లోలాక్షిని ఆర్పీ బాధ్యతల నుంచి తప్పించామంటూ అధికారులు చేతులు దులుపు కుంటున్నారే తప్ప మోసపోయిన మహిళలకు న్యాయం చేయటం లేదన్నారు. లోలాక్షి నుంచి వెంటనే తమ డబ్బులను రికవరీ చేసి బ్యాంక్‌కు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు వెడల్పు పనులు ..

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు

కొడంగల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా కొడంగల్‌లోని అంబేడ్కర్ విగ్రహన్ని తొలగించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ పనులు చేస్తున్నారు. నాలుగు రోజుల కిందట చౌరస్తాలో నూతన బోరు వేయించి మోటార్ బిగించారు. చౌరస్తా విస్తరణ అనంతరం అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ తెలిపారు. తొలగించిన విగ్రహన్ని ఎంపీడీవో కార్యాలయంలో భద్రపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ ఎం.కృష్ణంరాజు, జి.జగన్‌మోహన్, డీవీఎంసీ సభ్యుడు దస్తప్ప, బి.కృష్ణంరాజు, జి.రాములు, ఎ.రమేశ్ పాల్గొన్నారు.

విగ్రహం వద్ద అంబేడ్కరిస్టులు


అట్టహాసంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం ప్రతాప్‌సింగారంలోని ఆయన నివాసంలో అట్టహాసంగా నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచే ఆయన నివాసంలో సందడి నెలకొన్నది. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించి కేకులు కట్ చేశారు. అదేవిధంగా రక్తదానం చేశారు. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ మేయర్లు అమర్‌సింగ్, తోటకూర అజయ్‌యాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్దన్‌రెడ్డి, నాయకులు కందుల కుమార్, వేముల మహేష్‌గౌడ్, ముత్యాల్ యాదవ్, కవాడి వామన్‌రెడ్డి, బద్దం కుమార్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, మేడబోయిన జంగయ్య, గాయరు విశ్వనాద్, కృష్ణారెడ్డి, సంపత్, సత్యనారాయణ, దేవ, శంకర్, మల్లేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సుధీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్


సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి తదితరులు


సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

ప్రజల మనసు గెలిచిన నేత కేసీఆర్

- జిల్లా వ్యాప్తంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు


వికారాబాద్: చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్/మర్పల్లి/ధారూరు/కొడంగల్/బొంరాస్‌పేట్/పరిగి/చౌడాపూర్/కులకచర్ల/కోట్‌పల్లి/మోమిన్‌పేట్/నవాబుపేట్/దోమ/పెద్దేముల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల మనసు గెలిచిన నేత కేసీఆర్ అని పార్టీ శ్రేణులు అన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మొక్కలు నాటారు. అనంతరం ధన్నారం యజ్ఞ ఫౌండేషన్‌లో కేక్ కట్ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ధారూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం కేజీబీవీలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, హరిత సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. బొంరాస్‌పేట్‌లో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. యాదగిరి, నారాయణరెడ్డి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు. పరిగిలోని ప్రభుత్వాసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తన నివాస ప్రాంగణంలో వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటారు. నాటిన మొక్కలను మహేశ్‌రెడ్డి సెల్ఫీ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరవింద్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. కులకచర్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీరంపల్లి రాజు, కృష్ణయ్యగౌడ్, లక్ష్మయ్య, సారా శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు తాజా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం వృక్షార్చనలో భాగంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొత్రిక విజయలక్ష్మి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు విఠల్‌రెడ్డిలు మొక్కలు నాటారు. నాయకులు పట్లోళ్ల నర్సింహులు, నరేందర్ గౌడ్, అబ్దుల్ సలీం, రవీందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, దత్తాత్రేయ పాల్గొన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ కేక్ కట్‌చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రా రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, మహేందర్, మల్లయ్య ఉన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని చంద్రాయన్‌పల్లి సమీపంలో గల అల్ హెల్ప్ సొసైటీ అనాథ ఆశ్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దబ్బాని వెంకట్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, ప్రభు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. నవాబుపేట మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు భరత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా దోమ మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ దగ్గర మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, ఖాజా పాష, నరేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్, చంద్రప్ప, నాయకులు జనగాం ముకుంద్‌రెడ్డి, ముజీబ్, అరుణ్‌కుమార్, అనంతయ్య పాల్గొన్నారు.


కొడంగల్: వృక్షార్చన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


పరిగి: మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ ప్రతినిధి/ఘట్‌కేసర్/మూడుచింతలపల్లి/శామీర్‌పేట్: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలు, మున్సిపాల్టీల్లో కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కేక్‌లు కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. అనాథ ఆశ్రమాల్లో అన్నదానం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడవెల్లిలో మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావులు పాల్గొన్నారు. మొక్కలు నాటడంతో పాటు మల్లన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. కృషి ఆశ్రమంలో పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి భోజనాలు చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మల్లన్న ఆలయం వద్ద డోలు వాయించి బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో దయానంద్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం ఎంపీ సంతోష్ రావు, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ భూ సాకేత్ గేటెడ్ కమ్యూనిటీలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక కృషి హోమ్ అనాథ ఆశ్రమం విద్యార్థులతో కేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్ యాదవ్, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిదిలోని అన్నోజిగూడ సంస్కృతి టౌన్‌షిప్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం స్థానిక యాదాద్రి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, రెడ్డియానాయక్, శేఖర్, శ్రీనివాస్, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మూడుచింతలపల్లిలో మాజీ సర్పంచ్ జాము రవి ఆధ్వర్యంలో వీరారెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ మధుకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, అనిల్‌రెడ్డి, యాదగిరి, గోపాల్ పాల్గొన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులుప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. అలియాబాద్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, గోపాల్, వెంకటేశ్, రాజు, తదితర నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.


మేడ్చల్: డోలు వాయిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో మాజీ రాజ్య సభ సభ్యుడు సంతోష్‌రావు

తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల అడ్మిషన్ల కోసం ఈనెల 23వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

యాలాల ఎంఈవో బాధ్యతల స్వీకరణ

యాలాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యాలాల మండల నూతన ఎంఈవోగా జుంటుపల్లి జీహెచ్ఎం డి.రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. యాలాల ఎంపీడీవో పుష్పలీలకు తన నియామక పత్రాన్ని రమేష్ అందజేశారు. నేటి నుంచి ఎంఈవోగా రమేష్ విధులు కొనసాగిస్తారని ఎంపీడీవో పుష్పలీల తెలిపారు. రిటైర్డ్ ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో యాదయ్య తదితరులు ఉన్నారు. ఎంఈవో రమేష్‌ను ఎంపీడీవో, ఎంపీవో, రిటైర్డ్ ఎంఈవోలు శాలువాతో సన్మానించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పరిగి: ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామంలో శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సోమవారం కొత్తగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు.

దౌల్తాబాద్: గోకఫస్లాబాద్ గ్రామంలో శివాలయం పున ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు.


పూజా కార్యక్రమాల్లో తిరుపతిరెడ్డి

ఘనంగా మల్లన్న స్వామి జాతర


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర కీసర, చీర్యాల్‌లో ఘనంగా జరిగింది. సోమవారం జరిగిన జాతరలో భాగంగా ఉదయం స్వామివారి కల్యాణం, అగ్నిగుండాలు, పఠం తొక్కటం, వంటి కార్యక్రమాలు జరిగాయి.ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌లు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించారు.

కొలువుదీరిన కొత్త టీచర్లు

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులందరికీ శనివారం నియామకపత్రాలుఅందజేశారు. వికారాబాద్ జిల్లాలో నియమించిన 100 మంది ఎస్జీటీ ఉపాధ్యాయుల్లో 97 తెలుగు మీడియం, ముగ్గురు ఉర్దూ మీడియం వారు ఉన్నారు. 97 ఎస్జీటీ ఉపాధ్యాయుల్లో 93 మంది మాత్రమే నియామకపత్రాలు అందుకున్నారు.

అత్యధికంగా బషీరాబాద్‌కు...

2008 డీఎస్సీ అభ్యర్థుల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో అత్యధికంగా బషీరాబాద్ మండలానికి 14 మంది ఉపాధ్యాయులను కేటాయించగా, అత్యల్పంగా పూడూరు మండలంలో ఇద్దరిని నియమించారు. బంట్వారం మండలానికి అయిదుగురిని కేటాయించగా, బొంరాస్‌పేట్ 4, చౌడాపూర్‌కు 5, ధారూరుకు 4, దోమకు 5, దౌల్తాబాద్‌కు 8 మందిని కేటాయించారు. దుద్యాల్ మండలంలో 5, కొడంగల్‌కు 5, కోట్‌పల్లికి 4, కులకచర్లకు 6, మర్పల్లికి 5, మోమిన్‌పేట్‌కు 4, నవాబ్‌పేట్‌కు 4 కేటాయించారు. పెద్దేముల్‌కు 7, పరిగికి 3, తాండూరుకు 3, యాలాల్‌కు 4 ఉపాధ్యాయులను కొత్తగా కేటాయించారు. ఉర్దూ మీడియంలో మర్పల్లికి ఇద్దరిని, బంట్వారం మండలానికి ఒకరిని నియమించారు. వీరి నియామకంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంత వరకు తీరనుంది. ఏడేళ్లుగా సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యా బోధన అంతంత మాత్రంగానే కొనసాగిన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబరు నెలలో నియామకమైన ఉపాధ్యాయులకు డీఎస్సీ 2008 ఉపాధ్యాయులు తోడవడంతో ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలు బలోపేతమయ్యేందుకు అవకాశం ఏర్పడింది.

సంక్షిప్తంగా..

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పెద్దేముల్/బషీరాబాద్/చౌడాపూర్: పెద్దేముల్ మండలంలోని దుగ్గాపూర్‌లో ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల సీసీ రోడ్డు పనులను ఏఎంసీ ఛైర్మన్ సాయిని నారాయణ రెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా బషీరాబాద్ మండలం కొత్లాపూర్‌లో రూ.5లక్షల ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను తాజా మాజీ సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్ లింగ్యానాయక్ సోమవారం ప్రారంభించారు. అదేవిధంగా చౌడాపూర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్ టౌన్: మహేంద్ర యూనివర్సిటీ ఏఐఆర్‌వో జాతీయస్థాయిలో నిర్వహించిన పలు క్రీడాపోటీల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచి పతకాలను సొంతం చేసుకున్నారు. వారిని కళాశాల కార్యదర్శి టి.వి.రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ జి.సరోజరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, పీఆర్‌వో రవిసుధాకర్‌లు అభినందించారు.

బకాయి బిల్లుల సమస్య త్వరగా పరిష్కరించాలి

వికారాబాద్: బకాయి బిల్లుల సమస్య త్వరగా పరిష్కరించాలని పరిగి నియోజకవర్గంలోని మాజీ ఎంపీపీలు, ఎస్ఎంసీ ఛైర్మన్లు కోరారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. పరిగిలో సోమవారం నిర్వహించిన జరిగిన వికలాంగుల హక్కుల పరిరక్షణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు పి.సుదీర్, పి.చంద్రయ్య,చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి రాని దరఖాస్తులు

కోట్‌పల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని కోట్‌పల్లి ఎంపీడీవో డానియల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ వేణుమాధవ్, ఆర్‌ఐ భాగ్యలక్ష్మి, ఏపీఎం శివ్వయ్య, ఏపీవో ఎలీషా ఉన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

కులకచర్ల: ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్వేలో వివరాలు నమోదు చేసుకొని కుటుంబాలు 258 ఉన్నాయని తెలిపారు.

సొసైటీ ఛైర్మన్‌కు సన్మానం

కులకచర్ల: ప్రభుత్వం సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడగించడంతో సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఛైర్మన్ కనకం మొగులయ్య, పాలకవర్గ సభ్యులను సిబ్బంది సన్మానించారు.

భానుశంకర్ కుటుంబానికి ఆర్థిక సాయం

పరిగి: పరిగి పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన భానుశంకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. బాధిత కుటుంబానికి సహచర పోలీస్‌సిబ్బంది సహకారంతో రూ.55వేల నగదును సోమవారం ఎస్ఐ సంతోష్ చేతుల మీదుగా అందజేశారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

కొడంగల్ రూరల్: వేసవిలో గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

కోట్‌పల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్‌టీం కేజీబీవీ కోట్ పల్లి పాఠశాలలను సందర్శించింది. పరీక్షల రికార్డులను సోమవారం పరిశీలించినట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓవ్యక్తి మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చిట్యాల్ మండలం చిన్నకాపర్తికి చెందిన రూపాని వెంకన్న(49) పని నిమిత్తం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటకు రెండు రోజుల కిందట వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం భార్యకు ఫోన్‌చేసి ఇంటికి బైక్‌పై వస్తున్నానని చెప్పి బయల్దేరాడు. అయితే, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సమీపంలోని ఓకల్వర్టు వద్ద వెంకన్న మృతదేహం, పక్కనే బైక్ పార్కింగ్ చేసి ఉండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి వెంకన్న నుదుటి భాగంలో చిన్న గాయాన్ని గుర్తించారు. అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతుడు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బిట్స్ చౌరస్తా వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న లంతాయిపల్లికి చెందిన ఇద్దరు యువతులు గాయత్రి, భవానిలను రెడ్‌మిక్స్ లారీ ఢీ కొట్టడంతో గాయాలపాలైన విషయం తెలిసిందే. వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని శ్రీకర ఆస్పత్రికి తరలించగా ఈనెల 11న భవాని మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గాయత్రిని శ్రీకర ఆస్పత్రి నుంచి నగరంలోని మరో ఆస్పత్రికి తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో గల్లంతైన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ హారిక తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దావత్ చేసుకోవడానికి వచ్చి ఈత సరదాతో పొన్నాల్ గండి చిత్తారమ్మ చెరువులో ఇద్దరు స్నేహితులు నీట మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా సందీప్‌సాగర్ మృతదేహం చెరువులో తేలియాడింది. బాలు ఆచూకీ లభ్యంకాలేదు. సందీప్ సాగర్ మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని జింకకు గాయాలు

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) గుర్తుతెలియని వాహనం జింకను ఢీ కొట్టడంతో జింక తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ అనంతగిరి ప్రాంతంలో చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదం జరగగా వాహనదారులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఎస్‌వో అరుణ ఫారెస్ట్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని జింకను పశువైద్య శాఖలకు తరలించారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నంపై జిల్లా పంచాయతీ అధికారి ఆరా!

బషీరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నంపై డీపీవో సోమవారం బషీరాబాద్ ఎంపీడీవోను ఆరా తీశారు. బిల్లులు రాలేదని కాశీంపూర్ మాజీ సర్పంచ్ సి.వెంకటయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంపై జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు ఎమైనా రావాల్సి ఉండేమోనని అప్పటికే విచారణ జరిపిన ఎంపీడీవో విజయ్‌కుమార్ వాస్తవ పరిస్థితిని డీపీవోకు ఫోన్‌లో వివరించారు. మాజీ సర్పంచ్ తన పేరుమీద ఎలాంటి పనులు చేపట్టినట్లు ఎంబీ రికార్డులు లేవన్నారు. ఇతరుల పేరు మీద ఎమైన పనులు చేపట్టారనే దానిపై సమగ్ర విచారణ జరిపి డీపీవోకు నివేదిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

దోమ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. మండలంలోని బొట్లవనితండాకు చెందిన రామావత్ దేశ్యనాయక్ దోమ మండలంలోని బుద్లాపూర్ మీదుగా ఆదివారం రాత్రి టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు లారీని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన టిప్పర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

దుద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గీతా జ్ఞాన గురుభక్త మండలి సహకారంతో శ్రీశ్రీ సద్గురు రామబ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 162మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 100 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి కంటి అద్దాలు అందజేశారు. 60 మందిని ఆపరేషన్ల కోసం హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్, ఎంఎస్ రెడ్డి లయన్స్‌క్లబ్‌కు పంపినట్లు నిర్వాహకులు తెలిపారు.

తాండూరు వాసికి అంతర్జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న బస్వరాజ్

తాండూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్న తాండూరుకు చెందిన బస్వరాజ్‌కు మలేషియా టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ అంతర్జాతీయ పురస్కారాన్ని అందజేసింది. ఈనెల 15న మలేషియాలో నిర్వహించిన టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేశారు. బస్వరాజ్‌ను బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరు రాజ్‌కుమార్ సన్మానించారు.

కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

బషీరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దరు గ్రామ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. భోజ్యానాయక్‌తండా కార్యదర్శి సంధ్యారాణి, హంక్యానాయక్‌తండా కార్యదర్శి మహేశ్వరి ప్రసూతి సెలవులపై వెళ్లడంతో నవాల్గ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటప్పకు భోజ్యానాయక్‌తండా, బాబునాయక్‌తండా కార్యదర్శి రాజుకు హంక్యానాయక్‌తండా పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

శ్రీశైల క్షేత్రానికి బయల్దేరిన శివస్వాములు

కోట్‌పల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ని బుగ్గపురం గ్రామానికి చెందిన శివస్వాములు సోమవారం బుగ్గ రామలింగేశ్వర ఆలయం నుండి శ్రీశైలానికి బయలు దేరారు. ఈ స్వాములకు కోట్‌పల్లి స్థానిక పెట్రోల్ పంపు యజమాని మర్పల్లి మండలానికి చెందిన గూడెపు నర్సిములు యాదవ్ అధ్వర్యంలో ఆయన అభిషేకం నిర్వహించి స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజ కార్యక్రమంలో శివస్వాములు మహేందర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.